

10 YEAR ANNIVERSARY 2014 - 2024

# పెన్ పవర్

తెలంగాణ రౌండప్

సోమవారం | 28 అక్టోబర్ 2024 | పేజీలు 8




బౌరంపేట్ రామాజీకుంట లేక్ఐడి నెం.2824.. పాత, కొత్త మ్యాప్‌ల వ్యత్యాసం..

- దుండిగల్ గండిమైసమ్మ మండలంలో చెరువుల కబ్జాలపై సంబంధిత యంత్రాంగం నిర్లక్ష్యం..
- తాజాగా బౌరంపేట్ గ్రామానికి చెందిన రామాజీకుంట చెరువులో మట్టినింపుతున్న కబ్జాదారులు..
- 2022లో బఫర్ కోఆర్డినేట్స్ మార్చేసి 'ఎన్‌ఓసి' జారీ.. ఇప్పుడు అదే చెరువులో మట్టినింపి కొత్త ఆక్రమణ..
- అప్పట్లో 'క్రీక్‌స్కూల్' ఎకరం కబ్జాను ప్రోత్సహించిన రెవెన్యూ, ఇరిగేషన్, అధికారులు..
- ఆతర్వాత రాయలసీమ వాసికి సర్వే నెం.536లో 2-27 ఎకరాలు కట్టబెట్టేందుకు 'ఎన్‌ఓసి'..
- లేక్ఐడి నెం.2824 రామాజీకుంట కోఆర్డీనేట్స్ మార్పుతో కబ్జాదారులకి రక్షణ కవచం..
- గతంలో కూల్చివేసిన షెడ్డు మళ్లీ నిర్మించారు.. ఇప్పుడు ఏకంగా మట్టి నింపుతున్నారు..
- రెవెన్యూ, ఇరిగేషన్, లోకల్‌బాడీ శాఖల విధుల నిర్వహణ..! కబ్జాలను ప్రోత్సహించడానికా..?

# రామాజీకుంటకి..!
# రామ్ రామ్..!!



చెరువులో మట్టినింపేది, నర్సరీకి అద్దెకు ఇవ్వడానికేనట..

- రూ.120 కోట్లు విలువైన చెరువు స్థలాన్ని ఓవైపు 'ఎన్‌ఓసి'తో కబ్జాదారులకి పట్టం..?
- మరోవైపు కోఆర్డీనేట్స్ మార్పుల అనంతరం తాజాగా మట్టి నింపుతున్న వైనం..
- ఏడాదికి ఏడాది కనుమరుగు అవుతున్న బౌరంపేట్ లేక్ఐడి నెం.2824..రామాజీకుంట చెరువు..



నిర్మాణాలు చెరువులోనే ఉండగా.. తాజాగా మట్టినింపుతున్న వైనం..

మాధవ్ పత్తి..

**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, అక్టోబర్ 27:** సుమారు రూ.120 కోట్లు విలువైన 'చెరువు' స్థలాన్ని కబ్జాదారులకి పట్టం కట్టారు..? టెక్నాలజీ సాయంతో.. శిఖం భూములు "గోల్ మాల్" చేస్తున్నారు..

'రీ'సర్వేలపేరుతో 2013 నాటి ఎఫ్‌టిఎల్ కోఆర్డీనేట్స్ తారుమారు చేసి రూ.120 కోట్లు విలువైన లేక్ఐడి నెం.2824 రామాజీకుంట చెరువు శిఖం భూమిని వక్రమార్గంలో అక్రమార్కులకి అప్పగిస్తున్నారని సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.. దుండిగల్ మండలం బౌరంపేట్ లేక్ఐడి నెం.2824 రామాజీకుంట చెరువు శిఖం కబ్జాలు అధికారికంగా అప్పగిస్తున్న అధికారులు.. ఏళ్ళు గడిస్తే చెరువులు కుంచించుకు పోతాయా..? క్రీక్ స్కూల్ ఆక్రమణలో సుమారు ఎకరం శిఖం భూమి ఉండగా.. మరో వ్యక్తికి (రాయలసీమ) 2-27 ఎకరాల శిఖం భూమి ధారాదత్తం చేశారు.. తాజాగా చెరువులోకి వచ్చే సర్‌ప్లస్ నాలాకి అడ్డంగా మట్టినింపి నర్సరీ పెట్టేందుకు పనులు చేస్తున్నారు.. నాలాను మరోవైపుకి మారుస్తారట..! ఈవిషయం పనులు చేస్తున్నవారే చెప్పడం విడ్డూరం.. సాంకేతికతతో శిఖం భూముల కుంభకోణానికి, రెవెన్యూ, ఇరిగేషన్, సహకరిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి..

-2లో

## రాజ్ పాకాల ఫాంహౌస్ లో సోదాలు, విల్లాలో తనిఖీలపై కేసీఆర్ స్పందన



- కేటీఆర్ బావమరిది రాజ్ పాకాల ఫాంహౌస్ పై పోలీసుల దాడులు
- రాయదుర్గం ఓరియన్ విల్లాస్ వద్ద ఎక్సైజ్ సిబ్బంది తనిఖీలు
- అడ్డుకున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు
- తాజా పరిస్థితులపై డీజీపీకి ఫోన్ చేసి మాట్లాడిన కేసీఆర్

-4 లో

## కేటీఆర్ పాప్యులారిటీ చూసి రేవంత్ రెడ్డి అసూయతో రగిలిపోతున్నారు

- కేటీఆర్ బావమరిది ఫాంహౌస్ పై పోలీసుల దాడులు
- విల్లాలో తనిఖీలకు ఎక్సైజ్ శాఖ సిబ్బంది యత్నం
- కాంగ్రెస్ సర్కారుపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఫైర్



-4 లో

# రామాజీకుంటకి..! రామ్ రామ్..!!






రెవెన్యూ, ఇరిగేషన్ ఇచ్చిన ఎన్‌ఓసి.. ఈ బడా నిర్మాణ సంస్థకే..



రామాజీకుంటను 2022 సెప్టెంబర్ 17న తీసిన ఫైల్ ఫోటో..



బౌరంపేట్ రామాజీకుంటలో మట్టినింపిన తాజా ఫోటో..

## రామాజీకుంటలో మట్టినింపుతున్న.. మరికొందరు కబ్జాదారులు..

బడా బాబులకు కట్టబెట్టేందుకే.. ఎఫ్‌టిఎల్ కోఆర్డీనేట్స్ తారుమారు చేశారా..? చెరువుల ఆక్రమణలో అసలే ఏం జరుగుతోంది..?దుండిగల్ మండలం బౌరంపేట్ లేక్ఐడి నెం.2824 రామాజీకుంట చెరువు చుట్టూ కబ్జాదారులే దాపురించారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.. గతంలో "క్రీక్‌స్కూల్" యాజమాన్యం మట్టినింపి అక్రమ నిర్మాణాలు చేపట్టగా సహకరించిన అధికార యంత్రాంగం..! 2022- 2023లో ఓ వ్యక్తికి 2-27 ఎకరాల పట్టాభూమి పేరుతో చెరువు శిఖంలో ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్ కోఆర్డీనేట్స్ తారుమారు చేసి ఏకంగా మ్యాప్‌నే మార్చేశారు.. ఇంకేముంది తాజాగా మరికొందరు అక్రమార్కులు తెరపైకి వచ్చారు గత నాలుగు రోజులుగా చెరువులోకి వచ్చే సర్‌ప్లస్ వాటర్ ప్రవాహపు నాలాకు అడ్డంగా భారీ టిప్పర్‌లతో మట్టినింపి చదును చేస్తున్నారు.. ఈ వ్యవహారం మొత్తం నరేందర్ అనే వ్యక్తి చేస్తున్నట్లు, నర్సరీ పెట్టే వ్యక్తి చెప్పడం గమనార్హం.. చెరువును కతం పట్టించే దిశగా పనులు జరుగుతున్నాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.. భూగర్భజలాలు అడుగంటి నీటి సంక్షోభం ఏర్పడక ముందే సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు..

- మొదటి పేజి తరువాయి

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా దుండిగల్ గండిమైసమ్మ మండలంలో.. ప్రభుత్వ భూములైనా..! చెరువులు, కట్టుకాలువలు, చెరువులోకి వచ్చే సర్‌ప్లస్ వాటర్ నాలాలైనా..!అత్యంత సులువుగా కబ్జాదారులకి కట్టబెట్టేందుకే సంబంధిత అధికారులు మొగ్గు చూపుతున్నారు అనడంలో అతిశయోక్తి కాదు..! బౌరంపేట్ గ్రామ శివారు రామాజీకుంట లేక్ఐడి నెం.2824 చెరువును ఆక్రమించి "క్రీక్‌స్కూల్" కార్పోరేట్ సంస్థ కొంత కబ్జాచేయగా..! 2022లో ఓ వ్యక్తికి సర్వే నెంబర్ 536 పట్టా భూమి పేరుతో చెరువు శిఖాన్ని కూడా ఎఫ్‌టిఎల్ కోఆర్డీనేట్స్ తారుమారు చేసి రెవెన్యూ, ఇరిగేషన్ "ఎన్‌ఓసి" జారీచేశారు.. అధికారుల విధులతో ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ ఎలా ఉన్నప్పటికీ..! కబ్జాదారుల కోసం ఎంతటికైనా తెగిస్తున్నారని స్పష్టమవుతుంది..


ఏదో ఒకరకంగా అక్రమార్కులకు అప్పగించడం కామన్ అయిపోయింది.. జిల్లా కలెక్టర్‌లే చట్టంలోని లొసుగులతో 'ధరణీ' భూముల కుంభకోణంలో మేడ్చల్ జిల్లా మాజీ కలెక్టర్ "అమోయ్ కుమార్ ఐఏఎస్"పై ఈడీ విచారణ తెలిసిందే..! అదేవిధంగా బహుదూర్‌పల్లి సర్వే నెం.227 ప్రభుత్వ భూమి ఇరవై ఏళ్ళుగా హైకోర్టు పరిధిలో ఉన్న భూమిని సైతం..! ముగ్గురు కలెక్టర్‌ల హయాంలో..! కబ్జాదారులకు దర్జాగా ధరణీ రిజిస్ట్రేషన్‌లు, పట్టా పాసు బుక్కులు, మేడ్చల్ సబ్ రిజిస్టార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్‌లతో ధారాదత్తం చేశారు.. తాజాగా రూ.60 లక్షల ప్రభుత్వ నిధులతో సీసీరోడ్లు వేశారు.. అధికారులు నిజాయితీకి మారుపేరు అయినట్టు..

వార్త రాసిన విలేఖరి తప్పు చేసినట్టు వ్యవహరించారు.. ఈ రిజిస్ట్రేషన్‌ల ఘనకార్యం 2022 డిసెంబర్ నుండి ప్రారంభమై 2024 సెప్టెంబర్ వరకు 227 ప్రభుత్వ భూమిలో రిజిస్ట్రేషన్‌ల ప్రకియ కొనసాగింది..రాష్ట్రంలో సరైన పాలకులు ఉంటే


ఈ వ్యవహారం ఇంతవరకు వచ్చేదా..? అధికారులు ఇంతగా బరితెగించేవారా..? ఇప్పుడు బౌరంపేట్ రామాజీకుంట చెరువులో మట్టినింపడం వెనుక అధికారులకి భారీ మొత్తంలో ముడుపులు ముట్టి ఉంటాయని విమర్శలు లేకపోలేదు..

## హెచ్‌ఎండిఏ లేక్స్ వెబ్‌సైట్‌లో.. కొత్త మ్యాప్ అప్‌లోడ్..

2013 నాటి ఎఫ్‌టిఎల్ కోఆర్డీనేట్స్ ప్రకారం.. బౌరంపేట్- సింహపురి కాలనీకి వెళ్ళే దారి కూడా రామాజీకుంటలో భాగమే.. ఈ విషయం అధికారులకు తెలుసు.. గతంలో భారీ అక్రమ షెడ్డును కూల్చివేశారు.. ఆ తర్వాత అధికారులకు ముడుపులు ముట్టిన వెంటనే సదరు అక్రమ షెడ్డు సక్రమం చేసి మళ్ళీ నిర్మించారు.. అయినప్పటికీ తాజాగా రామాజీకుంటలో మట్టినింపుతున్నా రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులకి తెలియకపోవడం శోచనీయం.. చెరువు కబ్జాలను అడ్డు కోకుండా..! 2013 నాటి పాత కోఆర్డీనేట్స్‌ను తారుమారు చేసి చెరువును ఇంకాస్త కుంచించుకు పోవడానికి అధికారులు ప్రత్యేక పాత్రను పోషించారు.. ప్రజలు ఒక విషయాన్ని జాగ్రత్తగా గమనిస్తే..! చెరువుల ఆక్రమణకు గురైన ప్రతిచోటా బడా నిర్మాణ సంస్థలు, లేదా కార్పోరేట్ సంస్థలే ఉన్నాయి.. అధికారుల తీరు ఎలా ఉందంటే..! కబ్జాదారులకు ప్రభుత్వ ఆస్తులు కట్టబెట్టేందుకే అధికారులుగా విధులు నిర్వర్తిస్తున్నారా..? అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.. రామాజీకుంట పాత ఎఫ్‌టిఎల్ కోఆర్డీనేట్స్.. కొత్త ఎఫ్‌టిఎల్ కోఆర్డీనేట్స్ మ్యాప్‌లను పెన్ పవర్ దినపత్రికలో పరిశీలించవచ్చు.




ఎఫ్‌టిఎల్ కోఆర్డీనేట్స్ తారుమారు చేసి బడా నిర్మాణ సంస్థకి ఇచ్చిన ఎన్‌ఓసి.. 2022 సెప్టెంబర్ 23న




రామాజీకుంట చెరువు ఎఫ్‌టిఎల్ కోఆర్డీనేట్స్ మ్యాప్

# సీవరేజ్ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను సందర్శించిన కే.టీ.ఆర్





**ఉప్పల్, పెన్ పవర్ అక్టోబర్ 27:** నాచారంలోని సీవరేజ్ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను ఆదివారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టీ.ఆర్ స్థానిక ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, బీఆర్ఎస్ మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కలిసి వాటర్ ప్లాంట్ ను సందర్శించారు.

ఈ సందర్భంగా కే.టీ.ఆర్ మాట్లాడుతూ మూసీ కలుషిత నీటిని మరియు శుద్ధి చేసిన నీటిని పరిశీలించి ప్రజలకు మీడియా ముఖంగా చూపించారు. మూసీ వెంబడి ఇండ్లను కోల్పోతున్నవారికి అండగా నిలుస్తూ వారి తరఫున రాజ్యాంగ, న్యాయపరంగా రక్షణ కల్పిస్తామని, ఇప్పటికే 500 మందికి ఊరటనిచ్చే లా హైకోర్టులో స్టే ఆర్డర్లు వచ్చాయన్నారు. మూసీ ప్రాజెక్టుకు డీపీఆర్, అంచనా వ్యయం లేనప్పుడు పేదల ఇండ్లను ఎందుకు కూలగొడుతున్నారని ప్రశ్నించారు. పేదలను ఇబ్బంది పెడితే బీఆర్ఎస్ సహించబోదని, పేదల ఇండ్లు కూల్చే కుట్రలు చేస్తే ఊరుకోబోమని వారి పక్షాన పోరాటం చేస్తామని హెచ్చరించారు.

ఎస్టీపీలను సక్రమంగా నడిపితే నల్లగొండ జిల్లాకు పరిశుభ్రమైన నీరు వెళ్తుందని , దక్షిణాసియాలోనే మొదటగా వంద శాతం మురుగునీటిని శుద్ధి చేసిన నగరంగా హైదరాబాద్ నిలిచిందని, ఇది కేసీఆర్ ఘనతేనని అన్నారు. గతంలోనే రూ. 3800 కోట్ల ఖర్చుతో ఎస్టీపీలను బి.ఆర్.ఎస్ ప్రభుత్వంలోనిర్మించామని నగరంలో 57.5 కిలోమీటర్ల మేర ప్రవహించే మూసీకి పునరుజ్జీవం తేవాలంటే ముందుగా నీటిని శుద్ధి చేయాలని అప్పటి సీఎం కేసీఆర్ సంకల్పించారని గుర్తు చేశారు. గతంలో కాంగ్రెస్ మూసీ ద్వారా నల్లగొండకు మురుగు నీరు పంపితే, బీఆర్ఎస్ హయాంలో శుద్ధజలాలను పంపించే ప్రణాళికలను అమలు చేశామని . బీఆర్ఎస్ కట్టిన ఇండ్లకు సున్నం వేసి నేనే కట్టించిన అని గుంపు మేస్త్రీ సీఎం రేవంత్‌రెడ్డి చెప్పుకొంటున్నాడని కేటీఆర్ ఎద్దేవా చేశారు.

మూసీని శుద్ధి చేసేందుకు కొండపోచమ్మ ప్రాజెక్టు ద్వారా గోదావరి నీళ్లను మూసీ నదికి అనుసంధానం చేయాలని నిర్ణయించినట్లుగా తెలిపారు. దీనికి 2023లోనే రూ. 1100 కోట్లతో మూసీ అనుసంధాన పనులు చేపట్టినట్టుగా ఇక ఎస్టీపీలు, బ్రిడ్జిలు, గోదావరి అనుసంధానంతో మూసీకి పునరుజ్జీవం పోసిందే బీఆర్ఎస్ అని మరోసారి స్పష్టం చేశారు. మూసీ డెవలప్ అథారిటీ చైర్మన్‌గా సుధీర్‌రెడ్డి ఉన్నప్పుడే పనులన్నీ దాదాపు పూర్తి చేశామని తెలిపారు. అన్నింటికీ కలిపినా రూ. 25వేల కోట్లతో మూసీకి పూర్వ వైభవం వస్తుందని స్పష్టం చేశారు. పేదల ఇండ్లను కూల్చి, అవినీతి మూటలు ఢిల్లీకి తరలిస్తామంటే ఊరుకునేది లేదని మూసీ పేదలను రోడ్డుపై పడేసే లూటిఫికేషన్‌కు మాత్రమే తాము వ్యతిరేకమని కేటీఆర్ స్పష్టం చేశారు. బఫర్‌జోన్‌లో అనుమతులతో ఇండ్లు కట్టుకున్నవారిని కబ్జాదారులని సీఎం రేవంత్‌రెడ్డి ముద్ర వేస్తున్నారని మండిపడ్డారు. లక్షల మందిని రోడ్డున పడేసి, కోట్లాది రూపాయలు దోచుకుంటామంటే బీఆర్ఎస్ ఎలా మద్దతునిస్తుందని ఆయన ప్రశ్నించారు. మూసీ పేరిట లక్షన్నర కోట్లు ఎక్కడి నుంచి తెస్తారని సీఎంను ప్రశ్నించారు. పేదల ఇండ్లు కూల్చి, వారిని రోడ్డున పడేసి కట్టే మాల్స్



ఎందుకని ప్రశ్నించారు. ప్రభుత్వ దూకుడును తప్పుబట్టారు.

ఈ కార్యక్రమంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి గారు 100 కు పైగా ఎంబిబిఎస్ చదువుతున్న విద్యార్థులకు ఫీజు మొత్తం అండగా నిలబడుతున్న స్థానిక ఎమ్మెల్యేను అభినందించారు. ఎం.బి.బి.ఎస్ విద్యార్థులందరికీ చెక్కుల పంపిణీ కేటీఆర్ గారు చేతుల మీదుగా చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు మహమ్మద్ అలీ, సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్యేలు సుధీర్ రెడ్డి, కేపీ. వివేకానంద, ముఠా గోపాల్, కాలేరు వెంకటేష్, మాగంటి గోపీనాథ్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, పార్టీ రాష్ట్ర నాయకులు సింగిరెడ్డి సోమశేఖర రెడ్డి, కార్పొరేటర్లు శాంతి సాయిజెన్ శేఖర్, బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్, జెరిపోతుల ప్రభుదాస్, పన్నాల దేవేందర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు గుండారపు శ్రీనివాస్ రెడ్డి, కొత్త రామారావు, నాయకులు సాయిజెన్ శేఖర్, బన్నాల ప్రవీణ్, ఉప్పల్ సీనియర్ నాయకులు చల్లా రాజిరెడ్డి, అన్య బాలకృష్ణ, రావుల నవీన్ గౌడ్ పాల్గొన్నారు.

# మేడారం అడవుల్లో ప్రకృతి అటవీ విపత్తు

## ప్రదేశాన్ని పరిశీలించిన ఎన్ .హెచ్. ఆర్ .సి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మొగుళ్ళ భద్రయ్య

**ములుగు , పెన్ పవర్ అక్టోబర్ 27:** ములుగు జిల్లాలోని సమ్మక్క సారక్క తాడ్వాయి మండలం మేడారం అడవుల్లో గత కొద్ది రోజుల క్రితం సంభవించిన భారీ అటవీ విపత్తు జరిగిన ప్రదేశాన్ని జాతీయ మానవ హక్కుల కమిటీ (ఎన్ .హెచ్ .ఆర్ .సి) రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మొగుళ్ళ భద్రయ్య, ములుగు జిల్లా అధ్యక్షులు పెట్టెం రాజు, రాష్ట్ర కమిటీ సభ్యులు జి.సంజీవ, గోవిందరావుపేట మండల అధ్యక్షులు సన్నగుండ్ల వెంకటేశ్వర్లతో కలిసి సందర్శించారు. గత కొన్ని రోజుల క్రితం మేడారం తాడ్వాయి రహదారికి ఆనుకొని ఉన్న దట్టమైన అడవి ప్రాంతంలో భారీ వర్షాలతో, సుడిగాలుల ప్రభావంతో సుమారుగా 600 ఎకరాల్లో 70 వేల చెట్లు వేర్లతో సహా పెకలించుకుని నేలమట్టమయ్యాయి. భారీ వృక్షాలు ఈ విధంగా నేలమట్టమవడం ఇది మొదటిసారని స్థానికులు చెప్పుకొచ్చారు. దీంతో భారీ అటవీ ప్రళయంతో బీభత్సవం జరిగిందని అన్నారు. ఆ సమయంలో రహదారిపై రాకపోకలు ఉంటే తీవ్ర ప్రాణనష్టం జరిగి ఉండేదని అన్నారు. ఈ సందర్భంగా జాతీయ మానవ హక్కుల కమిటీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మొగుళ్ళ భద్రయ్య మాట్లాడుతూ ప్రకృతి విధ్వంసాల వల్లనే ఇలాంటి వైపరీత్యాలు సంభవిస్తున్నాయని ఇలాంటి సంఘటనలపై లోతైన అధ్యయనం చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. ప్రకృతి పరిరక్షణలో ప్రతి ఒక్కరిని భాగస్వామ్యం చేస్తూ అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని కోరారు. ములుగు జిల్లాలో చాలాచోట్ల అడవులను నరకడంతో పాటు నదులలోని ఇసుకను తరలించడం కూడా భూగర్భ ప్రళయాలకు తావిచ్చే అవకాశం ఉందని అనుమానం వ్యక్తం చేశారు. ప్రకృతికి విరుద్ధంగా ఏ పని చేసినా అంతే స్థాయిలో అనర్థాలు ఎదురవుతాయని అన్నారు. అటవీ బచావో పేరిట కార్యక్రమాలు ఏర్పాటు చేసి ములుగు ప్రాంతంలో ఉన్న అడవులను కాపాడుకునే విధంగా చర్యలు తీసుకోవాలని ములుగు జిల్లా అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తాడ్వాయి మండల నాయకులు శ్రీను, వినోద్, అనిల్ కుమార్, మహేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



## రాజ్ పాకాల ఫాంహౌస్ లో సోదాలు, విల్లాలో తనిఖీలపై కేసీఆర్ స్పందన

హైదరాబాద్ పెన్ పవర్:కేటీఆర్ బావమరిది రాజ్ పాకాల ఫాంహౌస్ పై పోలీసు దాడులు, రాజ్ పాకాల సోదరుడి విల్లాలో ఎక్సైజ్ సిబ్బంది సోదాలపై బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ స్పందించారు. రాయదుర్గం ఓరియన్ విల్లాస్ వద్ద ఎక్సైజ్ సిబ్బంది సోదాలను బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అడ్డుకున్నారు. దాంతో పోలీసులు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అదుపులోకి తీసుకున్నట్టు తెలుస్తోంది.
ఈ నేపథ్యంలో, కేసీఆర్ తాజా పరిస్థితుల పట్ల అసహనం వ్యక్తం చేశారు. ఈ సాయంత్రం కేసీఆర్ రాష్ట్ర డీజీపీ జితేందర్ కు ఫోన్ చేసి మాట్లాడారు. తనిఖీలు చేయడానికి సెర్చ్ వారెంట్ ఉందా? వారెంట్ లేకుండా సోదాలు ఎలా చేస్తారు? తక్షణమే సోదాలు ఆపాలి అని స్పష్టం చేశారు.

## కేటీఆర్ పాప్యులారిటీ చూసి రేవంత్ రెడ్డి అసూయతో రగిలిపోతున్నారు

హైదరాబాద్ పెన్ పవర్:కేటీఆర్ బావమరిది రాజ్ పాకాల ఫాంహౌస్ పై పోలీసులు దాడులు, ఎక్సైజ్ శాఖ తనిఖీలకు యత్నించిన నేపథ్యంలో, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సీఎం రేవంత్ రెడ్డిపై ధ్వజమెత్తారు. కేటీఆర్ ను తప్పుడు కేసులో ఇరికించేందుకు రేవంత్ రెడ్డి ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. ఫాంహౌస్ లో నిర్వహించిన పార్టీలో కేటీఆర్ భార్య శైలిమ కూడా ఉన్నారన్నది అవాస్తవం అని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కేపీ వివేకానంద్, డాక్టర్ కె.సంజయ్, జి.శ్రీనివాస్ యాదవ్, సతీశ్ రెడ్డి ఇవాళ మీడియాతో మాట్లాడారు. కేటీఆర్ కుటుంబంపై వచ్చిన ఆరోపణలను ఖండిస్తున్నట్టు తెలిపారు. ఎన్నికల హామీలు అమలు చేయడంలో తమ వైఫల్యం నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకే ప్రభుత్వం ఈ విధంగా తప్పుడు ఆరోపణలు చేస్తోందని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ధ్వజమెత్తారు. కేటీఆర్ ను అప్రదిష్ఠపాల్జేసేందుకు యత్నిస్తున్నారని, ఆయనను మానసిక వేధింపులకు గురిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల్లో కేటీఆర్ కు ఉన్న పాప్యులారిటీని అధికార కాంగ్రెస్ జీర్ణించుకోలేకపోతోందని అన్నారు. ఓవైపు కేటీఆర్ కు ప్రజాదరణ అంతకంతకు పెరుగుతుండడం, మరోవైపు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రజల్లో ఆదరణ తగ్గిపోతుండడం కాంగ్రెస్ వర్గాలకు మింగుడుపడడంలేదని పేర్కొన్నారు. అంతేకాకుండా, రేవంత్ రెడ్డి కూడా కేటీఆర్ పట్ల అసూయతో రగిలిపోతున్నారని, అందుకే ఆయనపై వ్యక్తిగత ఆరోపణలు చేస్తున్నారని ఆరోపించారు. రేవంత్ రెడ్డి ప్రస్తుతం కేటీఆర్ ఫోబియాతో బాధపడుతున్నారని ఎద్దేవా చేశారు.

## రెచ్చగొట్టిన 39 మంది పోలీసులపై.. సస్పెన్షన్ వేటు

హైదరాబాద్ పెన్ పవర్:గతకొద్దిరోజులుగా తెలంగాణ రాష్ట్ర స్పెషల్ పోలీసులు ఏక్ స్టేట్ ఏక్ పోలీస్ విదానం కోసం ఆందోళనలు చేస్తున్నారు. బెటాలియన్ కానిస్టేబుళ్ల కుటుంబాలు రోడ్లపై దర్నాకు దిగాయి. స్పెషల్ పోలీస్ కానిస్టేబుల్స్, వారి కుటుంబాలను రెచ్చగొట్టిన పలువురు పోలీసులపై ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఈ మేరకు వారిపై తెలంగాణ ప్రభుత్వం సస్పెన్షన్ విధించింది.
ఏడు బెటాలియన్ల పరిధిలో మొత్తం 39 మందిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. 3వ బెటాలియన్ ఇబ్రహీంపట్నం, 4వ బెటాలియన్ మమ్నూర్, 5వ బెటాలియన్ చల్వాయి, 6వ బద్రాద్రి కొత్తగూడెం , 12వ బెటాలియన్ అన్నెపర్తి, 13వ బెటాలియన్ మంచిర్యాల, 17వ బెటాలియన్ సిరిసిల్ల లో పలువురు కానిస్టేబుల్స్, హెడ్ కానిస్టేబుల్స్ ను సస్పెండ్ చేశారు.

# జర్నలిస్ట్ సంఘాల నిరసనకు తలొగ్గిన ప్రభుత్వం

### సలహాలు, జర్నలిస్టులు, జర్నలిస్ట్ సంఘాలు సూచనలకు అవకాశం

### తెలంగాణ ప్రదేశ్ జర్నలిస్ట్ యూనియన్ వినతిని స్వీకరించిన కమిటీ

**పెన్ పవర్, హైదరాబాద్ అక్టోబర్ 27:** తెలంగాణ రాష్ట్రంలో నూతనంగా మీడియా అక్రెడిటేషన్ కోసం తీసుకొచ్చిన జీవో 1395 లోని లోపాలు సవారించేందుకు ప్రభుత్వం స్వీకారం చుట్టడం పట్ల తెలంగాణ ప్రదేశ్ జర్నలిస్ట్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి. వై. గిరి, ఎం. శివ శంకర్ లు హర్షం వ్యక్తం చేశారు.
తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన ఆ జీవోపై తెలంగాణ ప్రదేశ్ జర్నలిస్ట్ యూనియన్ తో పాటు,జర్నలిస్ట్ సంఘాలు నిరసన వ్యక్తం చేయడంతో ప్రభుత్వం ఆ జీవోపైన పునరాలోచనలో రాష్ట్రంలోని వర్కింగ్ జర్నలిస్టులకు అక్రెడిటేషన్ మంజూరికి అవసరమైన విధి విధానాలు, మార్గదర్శకాలు రూపొందించడానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక కమిటీ ప్రథమ సమావేశం తాజాగా బూర్గుల రామకృష్ణారావు భవనంలో జరిగింది. మీడియా అకాడమీ చైర్మన్ కె .శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కమిటీ సభ్యులు ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె.శ్రీనివాస్, సియాసత్ న్యూస్ ఎడిటర్



ఎమ్మెల్సీ అమీర్ అలీ ఖాన్, హిందూ పొలిటికల్ ఎడిటర్ ఆర్ రవికాంత్ రెడ్డి, సీనియర్ ఫోటో జర్నలిస్ట్ కె .నరహరి, సమాచార పౌర సంబంధాల శాఖ జాయింట్ డైరెక్టర్ డి.యస్. జగన్ పాల్గొన్నారు. సమావేశంలో రాష్ట్ర హైకోర్టు తీర్పులు, నూతన మార్గదర్శకాలు, వివిధ రాష్ట్రాలలో అమలులో ఉన్న అక్రిడిటేషన్ కమిటీ నిబంధనలను, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాతో పాటు ఇతర మీడియాకు అక్రిడిటేషన్ల అంశాలపై ప్రాథమికంగా చర్చించడంపట్ల టి.పి.జె.యూ రాష్ట్ర కమిటీ సంతోషం వ్యక్తం చేశారు.రాష్ట్రంలో నూతన మార్గదర్శకాలపై ప్రస్తుతం జర్నలిస్టు యూనియన్లు/అసోసియేషన్లు, ప్రెస్ క్లబ్బులు, వ్యక్తుల నుండి ప్రత్యేక కమిటీకి రాతపూర్వకమైన సలహాలు, సూచనలను కమిటీ అమోదిస్తూ వచ్చే నెల నవంబర్ 15లోగా జర్నలిస్ట్ సంఘాలు, ప్రెస్ క్లబ్స్, సీనియర్ జర్నలిస్ట్ లు తమ సూచనల నివేదికలను తెలంగాణ రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ, జాయింట్ డైరెక్టర్ (ఎం ఆర్) ఏసీ గార్డ్స్ హైదరాబాద్ లో అందజేయాల్సిందిగా కమిటీ కోరినందున జర్నలిస్ట్ సంక్షేమం కోసం ఉద్దేశించిన ఆయా నివేదికలు లిఖితపూర్వకంగా అందజేయాలనీ తెలంగాణ ప్రదేశ్ జర్నలిస్ట్ యూనియన్ రాష్ట్ర కమిటీ కోరింది.

# ప్రెస్‌క్లబ్ నూతన కమిటీ ఎన్నిక..

## అధ్యక్షులుగా ఎర్రబోయిన మురళి..





**మహబూబాబాద్, పెన్ పవర్, అక్టోబర్ 27:**
దంతాలపల్లి మండల నూతన కార్యవర్గాన్ని మండల కేంద్రములోని సాయి బాలాజీ గార్డెన్ లో ఆదివారం ప్రెస్ క్లబ్ అధ్యక్షుడినీ ఎన్నుకున్నారు. ఈ సందర్బంగా అధ్యకుడిగా ఎర్రబోయిన మురళి,ప్రధాన కార్యదర్శిగా పెరుమాండ్ల విజయ్,ఉపాధ్యక్షులుగా భూతం రమేష్, కోశాధికారీగా గుగులోత్ రవి, సహాయకార్యదర్శిగా పడిదం నరేందర్, ప్రచార కార్యదర్శిగా ఏరుకొండ సాయి లను ఎన్నుకున్నారు,.నూతన కమిటీ సభ్యులను పలువురు శాలువాతో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్బంగా నూతన ఎన్నికైన అధ్యక్షుడు మురళి మాట్లాడుతూ జర్నలిస్టల సమస్యలపై పోరాడుతు ప్రెస్ క్లబ్ ఉన్నతికై పాటుపడుతనని అన్నారు. ఈ కార్యక్రమంలో జుజ్జురు వెంకన్న, జుంకీలాల్, కార్పోతుల రాములు, వెంకట్ రెడ్డి,కాయ తోజు శ్రీనివాస్ చారి, కొండ వెంకన్న, సత్యనారాయణ, గుండాల భూపాల్, గుల్ల గట్టు దాసు, బాణాల బిక్షపతి, రామ్మూర్తి, జెల్ల శ్రీను, గుగులోత్ రవి, ఉపేందర్, సోమరపు నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# దీపావళి వేళ టపాసుల కాల్చటంపై హైదరాబాదీయులకు ఆంక్ష

**హైదరాబాద్ పెన్ పవర్:**దీపావళి వేళ హైదరాబాదీయుల పండుగ ఉత్సాహంపై నీళ్లు జల్లారు. ఉత్సాహంతో టపాసుల్ని పెద్ద ఎత్తున కాల్చాలనుకున్న వారికి పరిమితులు విధిస్తూ తాజాగా పోలీసులు డిసైడ్ చేశారు. ఎక్కువ శబ్దంతో వచ్చే టపాసుల్ని కాల్చకూడదని.. దీనికి సంబంధించిన మార్గదర్శకాల్ని హైదరాబాద్ నగరపోలీసులు పేర్కొన్నారు. దీపావళి రోజున బహిరంగ ప్రదేశాల్లో టపాసులు కాల్చటం.. రోడ్ల మీద అధిక ధ్వనులు వచ్చేక్రాకరస్ ను పేల్చకూడదని చెప్పారు. అంతేకాదు.. హైదరాబాద్ మహా నగర వాసులు పండుగ రోజు రాత్రి 8 గంటలకు క్రాకర్స్ కాల్చటం మొదలు పెట్టి పది గంటల్లోపు ముగించేందుకు అనుమతిచ్చారు. అనుమతి తర్వాత టపాసులు కాల్చటంపై నిషేధం ఉంటుందన్నారు. అంతేకాదు.. సుప్రీంకోర్టు ఇచ్చిన డెసిబెల్స్ నిబంధనను అతిక్రమించకూడదని స్పష్టం చేశారు. శబ్ద కాలుష్య కంప్లైంట్ల కోసం డయల్ 100కు ఫోన్ చేయొచ్చని చెప్పారు.దీపావళి వేళ



క్రాకర్స్ కాల్చటంపై ఉన్న పరిమితులకు లోబడి ప్రజలు వ్యవహరించాలన్నారు. లేని పక్షంలో చర్యలు తీసుకుంటామన్నారు. పోలీసు ఆదేశాల్ని పాటించకుండా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని.. టపాసులు అమ్మే షాపు యజమానులు ఎవరైనా సరే.. లైసెన్సు లేకుండా అమ్మొద్దని స్పష్టం చేశారు. సో.. దీపావళి వేళ.. క్రాకర్స్ కాల్చలనుకునే ఎవరైనా సరే.. పోలీసుల పరిమితులకు లోబడి ఉండాలన్న విషయాన్ని మర్చిపోకూడదు.


# కేటీఆర్ బామ్మర్దే కొకైన్ ఇచ్చిండు: జన్వాడ ఫామ్‌హౌస్ రేవ్ పార్టీ కేసులో సంచలన విషయాలు

**హైదరాబాద్ పెన్ పవర్:**రాష్ట్రంలో సంచలనం సృష్టిస్తోన్న జన్వాధ ఫామ్‌హౌస్ రేవ్ పార్టీపై మోకిల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్సై కోటేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మోకిలా పోలీసులు కేసు నమోదు చేశారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బామ్మర్ది రాజ్ పాకాల, విజయ్ మద్దూర్ ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. కాగా, జన్వాధ ఫామ్‌హౌస్ రేవ్ పార్టీ కేసుకు సంబంధించిన ఎఫ్ఐఆర్‌లో పోలీసులు కీలక విషయాలు పేర్కొన్నారు.



మాదకద్రవ్యాలు వాడుతున్నారన్న విశ్వసనీయ సమాచారం మేరకు డాగ్ స్క్వాడ్, ఎక్సైజ్, ఎస్ఓటీ పోలీసుల దాడులు చేశారు. శనివారం (అక్టోబర్ 26) రాత్రి 10:30 ఫిర్యాదు అందగా.. 11.30 వరకు పోలీసులు ఫామ్ హౌస్ కు చేరుకున్నారని తెలిపారు. పార్టీలో మహిళలు, పురుషులు ఇద్దరు ఉన్నట్లు గుర్తించాం. పోలీసులను చూసి మద్యం సేవిస్తున్న వారు కొందరు పరారయ్యేందుకు ప్రయత్నించగా.. వారిని పట్టుకున్నామని వెల్లడించారు. మొత్తం 16 మంది మహిళలు, 12 మంది పురుషులు పార్టీలో ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. ఫామ్ హౌస్ యజమాని సెర్చ్ వారెంట్ ఉందా అంటూ ప్రశ్నించాడని పేర్కొన్నారు. ఇదే పార్టీలో ఉన్న విజయ్ మద్దూరికి డ్రగ్ టెస్ట్ నిర్వహించగా రిజల్ట్ పాజిటివ్‌గా వచ్చిందని తెలిపారు. మహిళలు డ్రగ్ టెస్టుకు నిరాకరించారన్నారు. రాజ్ పాకాల, విజయ్ మద్దూరికి ఐదు సంవత్సరాలుగా పరిచయం ఉందని వెల్లడించారు.దీపావళి పండుగ చేసుకుందామంటూ పలువురిని రాజ్ పాకాల ఫామ్ హౌస్ కు ఆహ్వానించాడని పోలీసులు పేర్కొన్నారు. ప్రస్తుతం విజయ్ మద్దూరిని పోలీసులు విచారిస్తున్నారు. దర్యాప్తులో విజయ్ సంచలన విషయాలు వెల్లడించినట్లు పోలీసులు తెలిపారు. కేటీఆర్ బామ్మర్ది రాజ్ పాకాల వద్ద నుండే కొకైన్ తీసుకొని తాను సేవించినట్లు విజయ్ మద్దూరి మోకిలా స్టేట్మెంట్ ఇచ్చినట్లు పోలీసులు పేర్కొన్నారు.

# నేపాల్ యాత్రకు వెళ్లి.. కరీంనగర్ వాసి గుండెపోటుతో మృతి..



**హైదరాబాద్ పెన్ పవర్:** నేపాల్ యాత్రకు వెళ్లిన ఓ కరీంనగర్ వాసి జనక్ పురి ప్రాంతంలో గుండెపోటుతో మరణించిన సంఘటన ఆదివారం ( అక్టోబర్ 27) జరిగింది. కరీంనగర్ కు చెందిన నర్సింగరావు స్నేహితులతో కలిసి నేపాల్ కు విహారయాత్రకు వెళ్లారు. నేపాల్ లోని జనక్ పురి ప్రాంతంలో పర్యటిస్తుండగా.. ఒక్కసారిగా గుండెపోటుకు గురయ్యాడు.. స్పాట్ లో చనిపోయాడు. పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

## "డిజిటల్ కండోమ్" వచ్చేసింది.. ఏమిటిది.. ఎలా పనిచేస్తోంది?



**హైదరాబాద్ పెన్ పవర్:**ఒక జర్మనీ లైంగిక ఆరోగ్య బ్రాండ్, బిల్లీ బాయ్, సన్నిహిత క్షణాలలో ఏకాభిప్రాయం లేని రికార్డింగ్ ను ఎదుర్కోవడానికి ఒక ప్రత్యేకమైన ఉత్పత్తిని ప్రారంభించింది. "కాండోమ్" అని పిలువబడే ఈ యాప్ "డిజిటల్ కండోమ్" గా పనిచేస్తుంది. ఇది స్మార్ట్ ఫోన్ లు సెక్స్ సమయంలో ఆడియో లేదా వీడియోను రికార్డ్ చేయకుండా నిరోధిస్తుంది. అవును... సంభోగం సమయాల్లో అనధికారికంగా ఆడియో, వీడియో రికార్డులు కాకుండా రహస్యంగా ఉంచిన ఎలక్ట్రానిక్స్ డివైజ్ ల కట్టడికి జర్మనీకి చెందిన ఓ సంస్థ డిజిటల్ కండోమ్ యాప్ ను ప్రవేశపెట్టింది. అయితే... లైంగిక చర్యల్లో పాల్గొనే ముందు ఈ యాక్టివ్ చేసుకుని వర్చువల్ బటన్ స్వైప్ చేస్తే ఆడియో, వీడియో డివైజ్ లను బ్లూటూత్ ద్వారా బ్లాక్ చేస్తుంది. ఇలా అనధికార రికార్డింగ్ ల నుంచి రక్షణను అందిస్తుంది. ఈ నేపథ్యంలో... "నిజమైన కండోమ్ ను ఉపయోగించేటంత సులభం" అనే ట్యాగ్ లైన్ తో ఈ ప్రోడక్ట్ సోషల్ మీడియాలో సరికొత్త చర్చలను రేకెత్తించింది. ఈ సందర్భంగా స్పందించిన కంపెనీ... సన్నిహిత కార్యచరణకు ముందు వినియోగదారులు ఇద్దరూ తమ స్మార్ట్ ఫోన్ లను సమీపంలో ఉంచుతారు.. అనంతరం, అన్ని కెమెరాలు, మైక్రోఫోన్ లను బ్లాక్ చేయడానికి వర్చువల్ బటన్ ను స్వైప్ చేస్తారు. ఈ సమయంలో ఒక ఫోన్ బ్లాక్ నుంచి వైదొలగడానికి ప్రయత్నిస్తే ఓ అలర్ట్ సౌండ్ వస్తుందని తెలిపింది. ఈ నేపథ్యంలో... "ఇది ఏకకాలంలో అవసరమైనన్ని పరికరాలను బ్లాక్ చేయగలదు" అని తెలిపింది. ఇదే క్రమంలో స్పందించిన ఇన్నోసియన్ బెర్లిన్ సీసీఓ గాబ్రియేల్... ఈ యాప్ ను సృష్టించడం వెనుక సామాజిక బాధ్యత ఉందని అన్నారు. క్లయింట్ ల కోసం మాత్రమే కాకుండా.. సమాజం కోసం కూడా సమస్యలను పరిష్కరిస్తామని చెప్పుకొచ్చారు.

## కేటీఆర్ బామ్మర్ది ఫాంహౌజ్‌లో డ్రగ్స్ పార్టీపై కాంగ్రెస్ నేతల ఫిర్యాదు




**హైదరాబాద్ పెన్ పవర్:**హైదరాబాద్:కేటీఆర్ బామ్మర్ది ఫాంహౌజ్‌లో డ్రగ్స్ పార్టీపై లోతుగా దర్యాప్తు జరిపించాలని సైబరాబాద్ పోలీసులకు కాంగ్రెస్ మహిళా నేతలు ఫిర్యాదు చేశారు. ఆదివారం(అక్టోబర్27) సైబరాబాద్ కమిషనరేట్ కార్యాలయానికి వచ్చిన ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్, టీపీసీసీ అధికార ప్రతినిధి కల్వ సుజాత పోలీసు ఉన్నతా ధికారులను కలిశారు. మాజీ మంత్రి కేటీఆర్ బామ్మర్ది రాజ్ పాకాల ఫామ్ హౌజ్ లో జరిగిన డ్రగ్స్ పార్టీపై లోతైన దర్యాప్తు జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జన్వాడలోని ఓ ఫాహౌస్ పై నార్సింగ్ పోలీసులు, సైబరాబాద్ %ూు% పోలీసులు ఆదివారం దాడులు నిర్వహించారు. జన్వాడ రిజర్వ్ కాలనిలో ఉన్న ఫామ్ హౌస్ బీఆర్ఎస్ నాయకుడు కేటీఆర్ బామ్మర్ది రాజ్ పాకాల దిగా గుర్తించారు. భారీ శబ్దాలతో రాత్రి పార్టీ నడుస్తోందని వచ్చిన సమాచారం మేరకు.. పోలీసులు రైడ్స్ చేశారు. పోలీసులకు అక్కడ భారీగా డ్రగ్స్, ఫారిన్ లిక్కర్ బాటిళ్లు దొరికాయి. రేవ్ పార్టీలో 21 మంది పురుషులు, 14 మంది మహిళలు పాల్గొన్నారు. ఎక్సైజ్ శాఖ అనుమతి లేని 10.లీటర్ల ఫారిన్ లిక్కర్(7 బాటిళ్లు) పట్టుబడ్డింది. ఫామ్ హౌస్ పరిసర ప్రాంతాలు పోలీసులు సైఫర్ డాగ్స్ తో గాలిస్తున్నారు.

# 4 గంటల రేవంత్ టీం మధనం.. ఏమేం నిర్ణయాలు తీసుకున్నారంటే?

**హైదరాబాద్ పెన్ పవర్:**ఏదో చేద్దామనుకుంటే మరేదో అయినట్లుగా రేవంత్ రెడ్డి ప్రభుత్వ పరిస్థితి. హైడ్రాతో దేశ వ్యాప్తంగా సంచలనంగా మారటమే కాదు.. అక్రమ కట్టడాల కూల్చివేతల విషయంలో రేవంత్ సర్కారు తీసుకొచ్చిన వ్యవస్థ అందరిని ఆకర్షించింది. అయితే.. ఆరంభంలో ప్రదర్శించిన హడావుడి హైడ్రాకు శాపంగా మారింది. భారీగా వచ్చిన క్రేజ్ ను హ్యాండిల్ చేసే విషయంలో హైడ్రా తప్పులు చేసింది. పక్కా ప్లాన్ ప్రకారం వెళ్లకుండా.. సంచలనాలతో మరింత పేరు ప్రఖ్యాతుల్నిసొంతం చేసుకోవాలని తపించింది. ఇందులో భాగంగా నిబంధనల్ని తూచా తప్పకుండా ఫాలో అవుతున్నట్లు చెప్పినా.. రూల్ బుక్ లోని సంక్లిష్టతను.. స్థానికంగా ఉండే పరిస్థితుల్ని.. అన్నింటికి మించిన ప్రజల ఎమోషన్ ను అర్థం చేసుకునే విషయంలో జరిగిన పొరపాటు.. ప్రభుత్వానికి పెద్ద తలనొప్పిగా మారింది.

దీంతో.. ఎంత దూకుడుగా హైడ్రా బుల్డోజర్లు అక్రమకట్టడాల మీద దూసుకొచ్చాయో.. అంతే వేగంగా వెనక్కి వెళ్లిపోయిన పరిస్థితి. వినాయక చవితి తర్వాత దసరా వచ్చింది. వెళ్లింది. మరో నాలుగైదు రోజుల్లో దీపావళి వచ్చేస్తున్న వేళలోనూ చడీ చప్పుడు చేయకుండా కామ్ గా ఉండిపోయింది హైడ్రా. నిజానికి హైడ్రాతో రేవంత్ సర్కార్కుకు మొదట్లో మంచి గుర్తింపే వచ్చింది. ప్రముఖుల నుంచి సామాన్యుల మీదకు బుల్డోజర్లు రాగానే.. అప్పటివరకు వావ్ అన్న నోళ్లే.. హాహాకారాలు చేశాయి. దీంతో.. హైడ్రా కారణంగా పడిన మరకను తుడుచుకునే ప్రయత్నంలో మునిగిపోయింది రేవంత్ సర్కారు.

తాజాగా కేబినెట్ భేటీ నిర్వహించిన సందర్భంగా పలు ఆసక్తికర అంశాలను.. డెవలప్ మెంట్ మీదనే తమ ఫోకస్ అన్న సంకేతాల్ని ఇచ్చేలా నిర్ణయాలు ఉండటం



గమనార్హం. ఇప్పటివరకు రేవంత్ సర్కారు ఫ్లాగ్ షిప్ ప్రోగ్రాం అయిన హైడ్రా.. మూసీ ప్రక్షాళన.. ఫోర్త్ సిటీకి భిన్నంగా కేబినెట్ తాజా నిర్ణయాలు ఉన్నాయి. నాలుగు గంటల పాటు నాన్ స్టాప్ గా సాగిన కేబినెట్ భేటీలో తీసుకున్న నిర్ణయాల్ని చూస్తే..

2020 నుంచి ప్రభుత్వ ఉద్యోగులకు ఐదు డీఏలు పెండింగ్ లో ఉన్నాయి. వాటిల్లో ఒక డీఏను ఇవ్వాలన్న నిర్ణయం.

ఆర్థిక పరిస్థితి కుదుట పడగానే అన్నింటిని క్లియర్ చేస్తాం.

– జీవో 317, జీవో 46 పై సబ్ కమిటీ ఇచ్చిన నివేదికపై సుదీర్ఘంగా చర్చ. సదూర ప్రాంతాల్లో ఉన్న ఉద్యోగులకు సంబంధించి మెడికల్.. స్పౌజ్.. మ్యూచువల్ బదిలీలకు ఓకే

– నవంబరు 30 వరకు రాష్ట్రంలో కుల గణన సర్వే పూర్తి చేయాలి. నవంబరు 4 నుంచి 19 వరకు రాష్ట్ర మంతా ఇంటింటి సర్వే చేపట్టాలి. ఇందుకోసం దాదాపు 80 వేల ఎన్యూమరేటర్లను సర్వే విధులకు డిప్యూట్ చేస్తారు.

ఒక్కో ఎన్యూమరేటర్ నిర్దీత గడువు లోగా 150 ఇళ్ల నుంచి వివరాలు సేకరించాలి.

కులగణన సమగ్ర సమాచారాన్నిసేకరించి.. పబ్లిక్ డొమైన్ లో ఉంచుతాం.

ధాన్యం సేకరణకు సుమారు 6వేలకు పైగా కేంద్రాల్ని ఏర్పాటు చేయాల్సి ఉండగా.. ఇప్పటివరకు కొన్నిఏర్పాటు. మిగిలిన వాటిని త్వరలోనే ఏర్పాటు చేస్తాం.

గత ప్రభుత్వంలో రైస్ మిల్లర్ల వద్ద రూ.20వేల కోట్ల ధాన్యం మిగిలిపోయింది. ఇప్పటికీ డిఫాల్టర్లుగా ఉన్న వారిని మొత్తంగా తొలగించాలని నిర్ణయించాం. మిల్లర్లకు ధాన్యాన్ని కేటాయించేటప్పుడు వారిస్థాయిలను ఆధారంగా బ్యాంకు గ్యారెంటీలు తీసుకుంటుంది.

హైదరాబాద్ లో మెట్రో రైలు రెండో దశ విస్తరణకు సంబంధించిన డీపీఆర్ కు ఓకే.

నాగోల్ – శంషాబాద్, రాయదుర్గం – కోకాపేట్, ఎంజీబీఎస్ – చాంద్రాయణ గుట్ట, మియాపూర్ – పటాన్ చెరువు, ఎల్ బీ నగర్ – హయత్ నగర్ మొత్తం 76.4 కిలోమీటర్ల వరకు విస్తరణ చేపట్టాలన్న నిర్ణయం.

ప్రభుత్వ.. ప్రైవేటు భాగస్వామ్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి ఈ ప్రాజెక్టు చేపడతాం. రూ.24,269 కోట్లతో ఈ ప్రతిపాదనలు రూపొందించారు. దీనికి సంబంధించిన డీపీఆర్ ను కేంద్ర ఆమోదానికి పంపిస్తాం.

రాష్ట్రంలో 16–17 వేల కి.మీ. రోడ్ల నిర్మాణం చేపట్టాల్సి ఉంది. ప్రతి గ్రామ పంచాయితీ నుంచి మండల కేంద్రానికి బీటీ రోడ్డు, మండల కేంద్రం నుంచి జిల్లాలకు డబుల్ రోడ్డు, జిల్లా కేంద్రాల నుంచి హైదరాబాద్ కు ఫోర్ లేన్ రోడ్డు ఉండేలా డెవలప్ మెంట్. ఇందుకు సంబంధించిన ప్రణాళిక సిద్ధం చేస్తాం.

ఉస్మానియా ఆసుపత్రి కొత్త భవన నిర్మాణానికి గోషామహల్ లో స్థలం కేటాయింపునకు నిర్ణయం. పోలీసు శాఖ పరిధిలో ఉన్న స్థలాన్ని వైద్య ఆరోగ్య శాఖకు బదిలీ చేసేలా ఆమోదం.

ములుగు గిరిజన వర్సిటీకి 211 ఎకరాల కేటాయింపు. యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ వర్సిటీ ఏర్పాటుకు ఆమోదం. గచ్చిబౌలి స్టేడియాన్నిఈ వర్సిటీకి వినియోగించేలా నిర్ణయం.

స్కిల్ వర్సిటీకి అనుబంధంగా మధిర.. వికారాబాద్.. హుజూర్ నగర్ ఐటీఐలను కొత్తగా మంజూరు కొత్తకోర్సులకు.. రెండుకాలేజీలకు అవసరమైన సిబ్బంది మంజూరు

తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ కు కొత్తగా 142 పోస్టులను మంజూరు చేస్తూ మంత్రివర్గ ఆమోదం.

# రాజకీయ వారసత్వం పోరులో సమిధలెందరో ?

**హైదరాబాద్ పెన్ పవర్:**రాజకీయాల్లో పదవులు కావాలి. అవి ఆకర్షణీయంగా ఉంటాయి. అయితే వాటిని అందుకోవడానికి ఒక తరం నుంచి రెండవ తరం పోటీ పడినపుడు సహజంగానే వారసత్వం పోరు స్టార్ట్ అవుతుంది. అది ఒక్కోసారి బంధాలు అనుబంధాలు రక్త బంధాలను దాటి ముందుకు సాగుతుంది. అయినా అందులో నెగ్గిన వారు కొందరే. తల ఒగ్గిన వారే ఎందో.

భారతదేశం అంటేనే వారసత్వ రాజకీయాలకు మూలంగా చరిత్ర చెబుతోంది. స్వతంత్ర భారతంలో కాంగ్రెస్ కుటుంబం నుంచి తొలి వారసురాలిగా ఇందిరా గాంధీ కనిపిస్తారు. ఆమెకు సొంత కుటుంబంలో పోటీ లేదు కానీ కాంగ్రెస్ సీనియర్లతో పేచీ వచ్చింది.

అయితే ఎన్నో కష్టాలు నష్టాలు చవి చూసి చివరికి ఆమె తనదైన వ్యూహాలతో దాంతో పాటు తన ప్రతిభతో బయటకు వచ్చారు. పదహారేళ్ల పాటు సుదీర్ఘమైన పాలనను ఆయన దేశానికి ప్రధానిగా అందించి ఉక్కు మహిళగా నిలిచారు. ఇక ఇందిర తన ఇద్దరి కుమారులలో వారసుడిగా సంజయ్ గాంధీని ఎంచుకున్నారు. అయితే 33 ఏళ్లకే సంజయ్ గాంధీ మరణించడంతో రాజీవ్ గాంధీ అనూహ్యంగా ఆ స్థానంలోకి వచ్చారు. అయితే సంజయ్ ప్లేస్ లో వారసురాలు అవుదామనుకున్న ఆయన భార్య మేనకాగాంధీ మాత్రం గాంధీ కుటుంబానికి బయటనే ఉండాల్సి వచ్చింది.ఇక 1960 దశాబ్దాల్లో స్థాపించిన శివసేనలో బాల్ థాకరేకు వెన్నంటి ఉన్న సోదరుడి కుమారుడు రాజ్ థాక్రే చివరికి ఓడి బయటకు వెళ్ళిపోయారు. సొంత కుమారుడు ఉద్ధవ్ థాక్రేకే వారసత్వాన్ని బాల్ థాక్రే కట్టబెట్టారు.తమిళనాడులో చూస్తే డీఎంకేలో వారసత్వ సమస్య వచ్చింది. కరుణానిధి పెద్ద కుమారుడు అళగిరి చిన్న కుమారుడు స్టాలిన్ మధ్యన జరిగిన పోరులో చివరికి స్టాలిన్ గెలిచారు. పార్టీ పగ్గాలు అందుకుని సీఎం అయ్యారు. ఇపుడు ఆయన వారసుడిగా ఉదయనిధి ఎలాంటి ఇబ్బంది లేకుండా పార్టీలో కీలక స్థానానికి చేరుకున్నారు.తాను అన్నీ వదులుకుని రాజకీయాల్లోకి వచ్చాను అని చెప్పిన ఎన్టీఆర్ కి కూడా వారసత్వ బెడద తప్పలేదు. ఆయన ఇద్దరు అల్లుళ్ళు ఆయనకు సాయంగా రాజకీయాల్లో ఉండేవారు. అయితే మధ్యలో వచ్చిన లక్ష్మీపార్వతికి వారసత్వం ఎక్కడ పోతుందో అని కుటుంబం అంతా కలసి అన్న గారిని గద్దె దించేశారు. ఆ మీదట చంద్రబాబు తనకు సహకరించిన వారిని అందరినీ నెమ్మదిగా వారసత్వం పోటీలోకి రాకుండా చూసుకున్నారని చరిత్ర చెబుతోంది. ఈ క్రమంలో తోడల్లుడు దగ్గుబాటి వెంకటేశ్వరరావు వేరే దారి చూసుకున్నారు. బావమరిది హరికృష్ణ అయితే అన్న తెలుగుదేశం పార్టీని పెట్టి కూడా ఓటమి పాలు అయ్యారు. ఇపుడు టీడీపీ చంద్రబాబు పరం అయింది. ఆయన కుమారుడు లోకేష్ కి ఎలాంటి ఇబ్బంది లేకుండా వారసత్వ పగ్గాలు సులువుగా దక్కుతున్నాయి. తెలంగాణలో చూస్తే మరో ప్రాంతీయ పార్టీ బీఆర్ఎస్ లో ఈ రోజుకు బయటకు కనిపించని వారసత్వపు వార్ జరుగుతోంది అని అంటారు. అయితే పెద్దాయనగా కేసీఆర్ ఉన్నారు. ఆయన వారసుడు కుమారుడా మేనల్లుడా అన్నది కూడా కాలం నిర్ణయిస్తుంది



అంటున్నారు.ఇక వైఎస్సార్ అనబడే ఉమ్మడి ఏపీని పాలించిన దిగ్గజ నేత వైఎస్సార్ వారసుడిగా జగన్ బయటకు వచ్చారు. జనాలు ఆయనను గుర్తించారు. జగన్ కి సహాయంగా సోదరి షర్మిల తల్లి విజయమ్మ కూడా రాజకీయాల్లో తన వంతు పాత్ర పోషించారు.ఈ క్రమంలో 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చింది. ఆ మీదట అసలైన వారసత్వ పోటీ వచ్చింది. జగన్ తో పాటుగా రాజకీయ వారసత్వాన్ని షర్మిల కోరుకున్నారు అంటారు. అలా కోరుకోవడంలో తప్పు లేదు. కానీ అది అందలేదు, ఆ మీదట ఆమె తెలంగాణాలో పార్టీ పెట్టారు, ఏపీకి వచ్చారు, కాంగ్రెస్ ఏపీ చీఫ్ గా పదవిని తీసుకున్నారు. అన్న మీద ఆమె పోరు సాగిస్తున్నారు. అది ఆస్తుల కోసం పోరు అయినా దాని వెనక రాజకీయ ఆకాంక్షలు నెరవేరలేదన్న కసి బాధ ఉన్నాయని అంటున్నారు వైఎస్సార్ వారసత్వం ఎవరిది అన్నది ఎప్పుడో తేలిపోయింది. లేట్ గా షర్మిల వేరు పడి మళ్ళీ పోటీ అన్నా జనాలు ఒప్పేది లేదు, ఎందుకంటే ఆ ఫలాలు ఆల్రేడీ జగన్ కి ఇచ్చేశారు. సో అలా షర్మిల రాజకీయంగా అనుకున్న లక్ష్యాన్ని సాధించలేకపోయారనే చెప్పాల్సి ఉంది.

మరో వైపు చూస్తే వైఎస్సార్ వారసత్వం జగన్ కే అని అత్యధికులు భావిస్తున్నా దానికి ఈ అన్నా చెల్లెళ్ళ పోరు ఒక గుదిబండగా మారుతోంది. అంతిమంగా వైఎస్సార్ వారసత్వం ఎవరిది అన్న ఆసక్తి కూడా జనాలకు లేకుండా ఈ ఇద్దరి మధ్య సమరం కనుక చెలరేగితే మాత్రం అసలుకే ఎసరు వస్తుంది అని అంటున్నారు. మొత్తంగా చూస్తే వారసత్వం అన్నది కోరుకోవడం తప్పు కాదు, దానికి ఎలా చేరుకోవడం అన్నదే ముఖ్యం. ఆ విషయంలో గెలిచిన వారికి పదవులు దక్కితే ఓడిన వారు సమిధలుగా మిగిలిపోతున్నారు.

# బంగ్లాదేశ్ లో తొలిసారి వీధుల్లోకి వచ్చిన లక్షలాది హిందువులు.. భారీ ర్యాలీ

**హైదరాబాద్ పెన్ పవర్:**అంతకంతకూ పెరిగిపోతున్న దాడులు.. తమ స్వేచ్ఛను హరిస్తున్న వారిపై ఇంతకాలం మౌనంగా ఉన్న బంగ్లాదేశ్ హిందువులు ఒక్కసారి వీధుల్లోకి వచ్చారు. తమ సమస్యల పరిష్కారం కోసం గళం విప్పిన వారు.. తమకు జరుగుతున్న అన్యాయాలపై గళం వినిపించేందుకు బయటకు వచ్చిన వారి తీరు ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. బంగ్లాదేశ్ సనాతన్ జాగరణ్ మంచ్ ఇచ్చిన పిలుపుతో కదిలిన బంగ్లా హిందువులు.. మైనార్టీలుగా ఉన్న తమ డిమాండ్లను ప్రభుత్వం వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు.



ఒకవేళ తమ డిమాండ్లపై బంగ్లాదేశ్ ప్రభుత్వం సానుకూలంగా స్పందించకుంటే లక్షలాదిగా చిట్టగాంగ్ వీధుల్లోకి వచ్చిన తాము.. దేశ రాజధాని ఢాకా వైపు కవాతు చేస్తామని వారు స్పష్టం చేశారు. చారిత్రక లాల్‌డిఘి మైదానంలో చేపట్టిన ఈ నిరసన ర్యాలీకి కారణం.. షేక్ హసీనా బహిష్కరణ తర్వాత తమపై జరుగుతున్న దురాగతాలే. కనుచూపు జనంతో లక్షలాదిగా తరలి వచ్చిన వైనం.. ఆ దేశంలో మైనార్టీలపై సాగే దురాగతాలకు నిదర్శనంగా పేర్కొంటున్నారు. బంగ్లాదేశ్ చరిత్రలో మైనార్టీలైన హిందువులు నిర్వహించిన అతి పెద్ద నిరసన కార్యక్రమాల్లో ఇది పెద్దదిగా చెబుతున్నారు.

గత ఆగస్టు ఐదున షేక్ హసీనా పదవీచ్యుతురాలైన తర్వాత మైనారిటీలపై భౌతికదాడులు, లూటీలు, విధ్వంసకాండలు చోటు చేసుకున్న సంగతి తెలిసిందే. దీనిపై పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తాయి. మైనార్టీ హక్కులకు భంగం కలగనీయమని ఆ దేశ తాత్కాలిక ప్రభుత్వం హామీ ఇచ్చింది. అయినప్పటికీ.. దాడుల ఘటనలు అదేపనిగా సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో బంగ్లాలోని హిందువులు సంఘటితంగా భారీ ప్రదర్శకు దిగటం ఇదే తొలిసారి. తాజాగా జరుపుతున్న నిరసనల వేళ.. వారు ఎనిమిది డిమాండ్లను తెర మీదకు తీసుకొచ్చారు. తమ డిమాండ్ల విషయంలో తాత్కాలిక ప్రభుత్వం సానుకూలంగా స్పందించే వరకు వెనక్కి తగ్గేది లేదని స్పష్టం చేసింది. మహ్మద్ యూనస్ సారథ్యంలోని ప్రభుత్వ స్పందన కోసం ఎదురుచూస్తున్న హిందూసంఘాలు.. ఈసారి తాము తగ్గేదేలేదని స్పష్టం చేస్తున్నారు.

**హిందూ సంఘాల 8డిమాండ్లు ఇవే..**

మైనారిటీలపై దాడులతో ప్రమేయం ఉన్న వారిపై చర్యలను వేగవంతం చేసేందుకు ట్రిబ్యునల్ ఏర్పాటు

దాడుల బాధితులకు పరిహారం, పునరావసం కల్పించడం.తక్షణం మైనారిటీల పరిరక్షణ చట్టం తీసుకురావడం.

మైనారిటీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఏర్పాటు.

విద్యా సంస్థలు, హాస్టళ్లలో మైనారిటీలు ప్రార్థనలు చేసుకునేలా ఆరాధనా స్థలాలు, ప్రేయర్ రూమ్‌ల ఏర్పాటు

హిందూ బుద్ధిస్ట్, క్రిస్టియన్ వెల్ఫేర్ ట్రస్టులకు చేయూత

ప్రాపర్టీ రికవరీ అండ్ ప్రిజర్వేషన్ యాక్ట్, ట్రాన్స్‌ఫర్ ఆఫ్ ఎన్‌ట్రస్టెడ్ ప్రాపర్టీ యాక్ట్‌ను సక్రమంగా అమలు చేయడం.

సంస్కృతి, పాలి ఎడ్యుకేషన్ బోర్డును ఆధునీకరించడం, దుర్గాపూజకు 5 రోజుల సెలవుదినాలు ప్రకటించడం.

బంగ్లాదేశ్ లో మైనార్టీలుగా ఉన్న హిందువులు లక్షలాదిగా వీధుల్లోకి వచ్చి నిరసన తెలుపుతున్న వేళ.. దేశ పర్యావరణ శాఖా మంత్రి సైయద్ రిజ్వాన హసన్ స్పందించారు. హిందూ సమాజం డిమాండ్లను తాము తెలుసుకున్నామని.. వారికి హామీగా దుర్గాపూజకు రెండు రోజులు సెలవులు ప్రకటించామన్నారు. బంగ్లాదేశ్ చరిత్రలో రెండ్రోజులు సెలవు ప్రకటించటం ఇదే తొలిసారిగా ఆయన పేర్కొన్నారు. మరోవైపు తమ దేశంలో జరుగుతున్న హిందువుల నిరసన ర్యాలీని వివాదాస్పద రచయిత్రి తస్లీమా నస్రీన్ తన ఎక్స్ ఖాతాలో వీడియోను షేర్ చేశారు. ఇదిలా ఉండగా..బంగ్లా హిందువులు అక్కడి నుంచి పారిపోకూడదని ఆర్ ఎస్ఎస్ ప్రధాన కార్యదర్శి దత్రాత్రేయ హొసబలే వ్యాఖ్యానించారు. వారిరక్షణకు భారత ప్రభుత్వం కట్టుబడి ఉందని వెల్లడించారు. అంతేకాదు బంగ్లాదేశ్ హిందువుల భద్రతకు ఐక్యరాజ్యసమితి హామీ ఇవ్వాలన్న డిమాండ్ ను తెర మీదకు తీసుకొచ్చారు.

# గుడ్ న్యూస్ దీపావళికే ఇందిరమ్మ ఇళ్లు.. రైతులకు ఐదు వందల బోనస్



**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణ మంత్రి వర్గం పలు కీలక నిర్ణయాలను తీసుకుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మెట్రో రైలు విస్తరణ పనులపై సుదీర్ఘంగా చర్చించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్న సమయంలో మెట్రో రైలు విస్తరణపై నిర్ణయం తీసుకుంది. నాగోలు నుంచి ఎల్బీనగర్ వరకూ, ఎల్బీ నగర్ నుంచి హయత్ నగర్ వరకూ, ఎల్బీనగర్ నుంచి శంషాబాద్ ఎయిర్ పోర్టు వరకూ మెట్రో రైలు మార్గాలను విస్తరించాలని నిర్ణయించింది. దీంతో అనేక ప్రాంతాల వారికి మెట్రో రైలు అందుబాటులోకి రావడమే కాకుండా హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ సమస్యలకు చెక్ పడే అవకాశముందని భావించింది. వీలయినంత త్వరగా ఈ మెట్రో రైలు మార్గాల విస్తరణ పనులను చేపట్టేందుకు తెలంగాణ కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

**దీపావళికి కానుకగా...**

ఇక దీపావళికి పేద ప్రజలకు కానుకగా ఇందిరమ్మ ఇళ్లను తొలి విడత పనులను ప్రారంభించాలని, ఒక్కొక్క నియోజకవర్గానికి 3,500 ఇళ్లుఇవ్వాలని నిర్ణయిచింది. గ్రామ సభలను నిర్వహించి పారదర్శకంగా లబ్దిదారులను ఎంపిక చేయనున్నారు దీంతో పాటు రాష్ట్రంలో కుల గణను కూడా నవంబరు 30వ తేదీలోగా చేయాలని మంత్రి వర్గ సమావేశం నిర్ణయించింది. ధాన్యం సేకరణకు ఆరు వేల ధాన్యం కొనుగోలు కేంద్రాలను సత్వరం ఏర్పాటు చేయాలని నిర్ణయించింది.

**సన్న వడ్లకు బోనస్...**

దీంతో పాటు ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో ప్రధానమైన రైతులకు మరో గుడ్ న్యూస్ కేబినెట్ చెప్పింది. సన్న వడ్లకు ఐదు వంద రూపాయల బోనస్ ఇవ్వాలని నిర్ణయించింది. ఈ ప్రతిపాదనకు ఆమోదం తెలిపింది. దీంతో పాటు ములుగు జిల్లాలో సమ్మక్క సారలమ్మ యూనివర్సిటీకి సెంట్రల్ యూనివర్సిటీకి ఎకరానికి రెండు వందల యాభై రూపాయల చొప్పున భూమిని కేటాయించేందుకు అంగీకరించింది. ఇక రెరాలో యాభై నాలు ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయాలని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ను ఆదేశాలు జారీ చేసింది. ఉస్మానియా ఆసుపత్రిని కొత్తగా నిర్మించేందుకు గోషా మహల్ పోలీసుల భూమిని బదలాయించేందుకు మంత్రి వర్గ సమావేశం ఆమోదం తెలిపింది.

## అమెరికా వీసాకోసం సర్టిఫికెట్ ఫోర్జరీ కేసు..ఇద్దరు హైదరాబాదీలు అరెస్ట్




**హైదరాబాద్ పెన్ పవర్:** విద్యా, అమెరికా వీసా అభ్యర్థులకు ఉపాధి ఎక్స్ పీరియెన్స్ సర్టిఫికెట్లను ఫోర్జరీ చేసినందుకు హైదరాబాద్ కు చెందిన ఇద్దరు వ్యక్తులను చెన్నై పోలీసులు అరెస్ట్ చేశారు. చెన్నై యూఎస్ కాన్సెలేట్ అందిన ఫిర్యాదు మేరకు చెన్నై సిటీ పోలీసులు సెంట్రల్ క్రైం బ్రాంచ్ ( సీసీబీ) ఫోర్జరీ ఇన్వెస్టిగేషన్ వింగ్ ( ఎఫ్ ఐడబ్ల్యూ) దర్యాప్తు ప్రారంభించింది. గాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ అండ్ మేనేజ్ మెంట్ జారీ చేసిన హోటల్ మేనేజ్ మెంట్ లో డిప్లమా సర్టిఫికెట్ , హైదరాబాద్ లోని మారియట్ హోటల్ అండ్ కన్వెన్షన్ సెంటర్ లో నకిలీ ఎక్స్ పీరియెన్స్ సర్టిఫికెట్ చూపిస్తూ అజయ్ కుమార్ భండారీ అనే వ్యక్తి వర్క్ వీసా కోసం దరఖాస్తు చేసుకున్నట్లు ఫిర్యాదు లో పేర్కొన్నారు. హైదరాబాద్ కు చెందిన డ్రీమ్ ఫర్ ఓవర్సీస్ కన్సల్టెన్సీ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ద్వారా సర్టిఫికెట్లు ఫోర్జరీ చేస్తున్నట్లు దర్యాప్తు లో తేలింది. ఈ సంస్థకు చెందిన బాల నందేశ్వరరావును పోలీసులు అరెస్ట్ చేశారు. నిజామాబాద్ లో సైబెల్ టెక్నాలజీస్ నడుపుతున్న మరో వ్యక్తి కొప్పే మహేష్ ని కూడా పోలీసులు అరెస్ట్ చేశారు.

నకిలీ సర్టిఫికెట్లు అందించినందుకు వీరిద్దరూ ఒక్కొక్కరి నుంచి రూ. 5 లక్షల నుంచి 6 లక్షల వరకు వసూలు చేశారని వెల్లడైంది.

## రాయదుర్గం ఓరియన్ విల్లాస్ వద్ద బీఆర్ఎస్ నేతల ఆందోళన

**గతరాత్రి కేటీఆర్ బావమరిది రాజ్ పాకాల ఫాంహౌస్ పై పోలీసులు దాడులు**

**రాజ్ పాకాల విల్లాలో తనిఖీలకు ఎక్సైజ్ అధికారుల యత్నం**

**రాజ్ మరో విల్లాలో ఉన్నాడని అధికారులకు సమాచారం**

**తనిఖీలకు యత్నించిన అధికారులతో బీఆర్ఎస్ నేతల వాగ్వాదం**



**హైదరాబాద్ పెన్ పవర్:**బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బావమరిది రాజ్ పాకాల ఫాంహౌస్ పై పోలీసుల దాడుల వ్యవహారం తెలంగాణ రాజకీయాల్లో కాక రేపుతోంది. తాజాగా, రాయదుర్గం ఓరియన్ విల్లాస్ వద్ద బీఆర్ఎస్ నేతలు ఆందోళన చేపట్టారు. అసలేం జరిగిందంటే... రాయదుర్గంలోని రాజ్ పాకాలకు చెందిన విల్లాలో తనిఖీలు చేసేందుకు ఎక్సైజ్ అధికారులు వెళ్లారు. రాజ్ పాకాల విల్లాకు తాళం వేసి ఉండడంతో ఎక్సైజ్ సిబ్బంది వేచి చూశారు. అక్కడికి దగ్గర్లోనే మరో విల్లాలో రాజ్ పాకాల ఉన్నట్టు ఎక్సైజ్ అధికారులకు సమాచారం అందింది. దాంతో వారు ఆ విల్లాలో తనిఖీ చేసేందుకు యత్నించారు. తనిఖీలకు యత్నించిన ఎక్సైజ్ శాఖ అధికారులతో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు వాగ్వాదానికి దిగారు. సెర్చ్ వారెంట్ లేకుండా ఎలా తనిఖీలు చేపడతారని బీఆర్ఎస్ నేతలు ఎక్సైజ్ అధికారులను ప్రశ్నించారు. ఈ క్రమంలో అక్కడ ఉద్రిక్తత ఏర్పడింది.

# జగనే దిక్కు..అందరి మాటేనా ?



**హైదరాబాద్ పెన్ పవర్:**ఏపీ రాజకీయాలు చూస్తే రెండుగా చీలిపోయి చాలా కాలమే అయింది. రెండే కుటుంబాల మధ్యన రాజకీయాలు జరుగుతున్నాయి. ఇపుడు చూస్తే మధ్యలో జనసేన కూడా ఎంటర్ అయింది. ఆ విధంగా చూస్తే బలమైన ప్రధాన సామాజిక వర్గాలకు సంబంధించి వేటికవే పార్టీలు ఉన్నట్లుగా కూడా అనధికారికంగా చెబుతూంటారు. టీడీపీ అంటే ఒక సామాజిక వర్గం ఓన్ చేసుకుంటుంది అన్న భావన ఉంది. అలాగే జనసేనని మరో బలమైన సామాజిక వర్గం తమదిగా భావిస్తుంది అని అంటారు. వైసీపీ విషయంలో కూడా అలగే ఇంకో సామాజిక వర్గం తన సొంతం అని భావిస్తుందని అంటారు. అయితే ఈ సొంతం అన్న భావన అయితే 2019 వరకూ ఉండేది, 2024 ఎన్నికలకు వచ్చేసరికి బ్రేక్ అయింది అని కూడా అంటారు. దానికి కారణం సోషల్ ఇంజనీరింగ్ అని చెప్పి మరీ వైసీపీకి అంగబలం అర్థబలం దండీగా అందిస్తూ ఒక స్థాయికి తీసుకుని వచ్చిన వారిని పక్కన పెట్టేశారు అన్న బాధ ఉంది.

అందుకే వారు దూరంగా ఉంటూ వచ్చారు. ఫలితంగా వైసీపీకి ఘోరమైన ఓటమి దక్కింది. అయితే ఎనికలు జరిగి ఐదు నెలల తరువాత మెల్లగా ఆ సామాజిక వర్గంలో ఒక భావన కలుగుతోందా పునరాలోచనలు ఏమైనా వస్తున్నాయా అన్నది కూడా చర్చగా ఉంది.

ఇతర పార్టీలలో ఉన్నా తమకు అక్కడ తగిన ప్రాధాన్యత ఉండదని భావిస్తున్న వారు ఈ రోజుకీ వైసీపీలో కొనసాగుతున్నారు అలాంటి వారి గొంతుకగా లేక ఒక బలమైన సామాజిక వర్గం ఆలోచనగా అనంతపురం జిల్లా ధర్మవరం మాజీ ఎమ్మెల్యే వైసీపీకి చెందిన కీలక నాయకుడు కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి తాజాగా సామాజిక మాధ్యమాలలో వదిలిన ఒక వీడియో బైట్ లో సంచలన వ్యాఖ్యలే చేశారు. ఆయన ఆ ఆ బైట్ లో మాట్లాడుతూ ఇపుడున్న పరిస్థితుల్లో అందరూ జగన్ కి మద్దతు ఇవ్వాలని కోరారు. ఇది అనివార్యం అని కూడా అన్నారు. ఏపీలో చంద్రబాబుని టీడీపీని ఎదుర్కోవాలంటే జగన్ మాత్రమే దానికి తగిన వారు అని అన్నారు. విభేదాలు గొడవలు అసంతృప్తులు అన్ని చోట్లా ఉంటాయని వాటిని కాస్తా పక్కన పెట్టి అంతా ఆలోంచాల్సిన సమయం అన్నారు. సైలెంట్ గా క్యాడర్ కానీ లీడర్ కానీ కూర్చుంటే అది మరింత ప్రమాదకరమని కూడా ఆయన అన్నారు. టీడీపీ కూటమి చేస్తున్న అనర్థాలు అరాచకాల మీద వీడియోలు తీసి సోషల్ మీడియాలో పెట్టడం ద్వారా క్యాడర్ తమ పోరాటాన్ని ప్రారంభించాలని ఆయన కోరారు. మరో వైపు చూస్తే ఏపీలో టీడీపీ కూటమిలో జనసేన బీజేపీ ఉన్నాయి. ఇక విపక్షంలో చూస్తే కమ్యూనిస్టులు, కాంగ్రెస్ పార్టీలు ఉన్నాయి. రాయలసీమతో పాటు కొన్ని జిల్లాలలో బలంగా ఉన్న ఒక కీలక సామాజిక వర్గానికి ఇపుడు వైసీపీ తప్ప వేరో చోట రాజకీయం చేయడం అంటే ఇబ్బందే అని అంటున్నారు. ఏపీలో కూటమిని ఎదుర్కొనేది వైసీపీ తప్ప మరోటి కానే కాదని కేతిరెడ్డి చెబుతున్నారు. జగన్ హాండ్స్ ని బలోపేతం చేయడం ద్వారానే వైసీపీకి పూర్వ వైభవం తెచ్చుకోవచ్చు అని ఆయన అంటున్నారు. ఇక ఏపీలో ప్రతిపక్షం అంటే వైసీపీ కాక మరే పార్టీ ఉందని మాజీ మంత్రి పేర్ని నాని కూడా ఇటీవల వ్యాఖ్యానించారు. ఏపీలో మాజీ సీఎం గా అయిదేళ్ళ పాటు పాలించిన జగన్ ఉన్నారు. ఆయనకు అంగబలం అర్థ బలం ఉన్నాయి. గ్రాస్ రూట్ లెవెల్ వరకూ పార్టీ ఉంది. టీడీపీ కూటమిని ఢీ కొట్టాలీ అంటే వైసీపీయే అన్నది ఈ రోజుకు అయితే రాజకీయ విశ్లేషణగా కూడా ఉంది. అలాగే ఒక బలమైన సామాజిక వర్గం గత నాలుగైదు నెలలుగా డైలామాలో ఉంది. అయితే అలాంటివి కాకుండా అంతా జగన్ నే సపోర్ట్ చేయాలని కేతిరెడ్డి చెప్పడం పట్ల ఆసక్తికరమైన చర్చ సాగుతోంది. ఏది ఏమైనా ఏపీలో వైసీపీ తప్ప మరో పార్టీ విపక్షంలో లేకపోవడం కూడా జగన్ కి హెల్ప్ అవుతోంది. కూటమిలో మూడు పార్టీలు ఉండడం వల్ల విపక్షంలో వైసీపీ సోలోగా మారింది అని అంటున్నారు.

## ఓహో పొంగులేటి పేలుతుందన్న బాంబు ఇదేనా? అదన్న మాట సంగతి




**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ముందే చెప్పినట్లుగా దీపావళికి ముందే బాంబు పేలిందా? పొంగులేటి చెప్పిన బాంబు ఫాం హౌస్ బాంబా? అన్న చర్చ తెలంగాణ రాజకీయ పార్టీల్లో జోరుగా సాగుతుంది. సియోల్ నగరంలో పర్యటనలో ఉన్న పొంగులేటి శ్రీనివాసులు రెడ్డి నాలుగు రోజుల క్రితం దీపావళికి ముందే పొలిటికల్ బాంబ్ పేలుతుందని తెలిపారు. ఆయన చేసిన సంచలన వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయ పార్టీల్లో హాట్ టాపిక్ గా మారాయి. త్వరలోనే బీఆర్ఎస్ అగ్రనేతలు అరెస్టులు ఉంటాయంటూ ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. దీపావళి కంటే ముందే బాంబులు పేలవుతాయని తెలిపారు. అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు ఉండబోతున్నాయని చెప్పారు.

### రాజకీయ సెగలు...

అయితే పొంగులేటి జోస్యం నేడు నిజమయిందంటూ కొందరు రాజకీయనేతలు వ్యాఖ్యానిస్తున్నారు. జన్వాడ ఫామ్ హౌస్ లో రేవ్ పార్టీ కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బావమరిది ఫాం హౌస్ లోనే ఈ రేవ్ పార్టీ జరగడంతో పాటు అందులో పాల్గొన్న ఒకరికి పరీక్షల్లో డ్రగ్స్ తీసుకుంటున్నట్లు పాజిటివ్ గా రిజల్ట్ వచ్చిందని పోలీసులు తెలపడం, మోకిల పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు కావడం వంటివి చూస్తుంటే కేటీఆర్ ను రాజకీయంగా కట్టడి చేయడానికేనా? అన్న అనుమానం తమకు కలుగుతుందని బీఆర్ఎస్ నేతలు ప్రశ్నిస్తున్నారు. కేటీఆర్ పేరును బద్నాం చేయడానికి ఈ కేసును ఒక వాడుకోవాలని చూస్తున్నారన్నారు. కేవలం కేటీఆర్ బామ్మర్ది నిన్న కొత్త ఇంట్లోకి గృహ ప్రవేశం చేశారని, అయితే అందులో ఏడు విదేశీ మద్యం బాటిల్స్ ఉన్నాయని, ఒక మనిషి నాలుగు బాటిల్స్ కంటే ఎక్కువ ఉంచుకోవడానికి వీల్లేదని, దీనిపైనే కేసు నమోదయిందని బీఆర్ఎస్ నేతలు చెబుతున్నారు. కేవలం రాజకీయ కుట్రలో భాగంగానే ఇది జరుగుతుందని అన్నారు.

### రెండింటికీ ముడిపెడుతూ...

కానీ పోలీసులు మాత్రం తమ పని తాము చేసుకు పోతున్నారు. జన్వాడ ఫామ్ హౌస్ లో రేవ్ పార్టీ జరిగిందని, అందులో ఒకరికి డ్రగ్స్ తీసుకున్నట్లు నిర్ధారణ అయిందని, దీనివల్ల తాము కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు. మరోవైపు కాంగ్రెస్, బీజేపీ నేతలు కూడా కేటీఆర్ దీనిపై ఎందుకు మాట్లాడటం లేదంటూ నిలదీస్తున్నారు. కేటీఆర్ చెప్పేవన్నీ నిజాలు కాదని, ప్రతి రోజూ ఏదో ఒక అబద్ధం చెబుతూ ప్రభుత్వంపై బురద జల్లే కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఇబ్బందుల్లోకి నెట్టాలని చూస్తున్నారన్నారు. వీకెండ్ లో రేవ్ పార్టీ చేసుకుని, అందులో డ్రగ్స్ వాడింది నిజం కాదా? అని కాంగ్రెస్, బీజేపీ నేతలు ప్రశ్నిస్తున్నారు. చట్టపరంగా శిక్షించాలని డిమాండ్ చేస్తున్నారు. మొత్తం మీద పొంగులేటి శ్రీనివాసులు రెడ్డి వారం రోజుల క్రితం చెప్పిన బాంబు ఇదేనా? అంటూ సోషల్ మీడియాలో చర్చ సాగుతుంది. రాజకీయ వర్గాల్లోనూ ఇది ముందుగా పొంగులేటికి ఎలా తెలిసిందబ్బా? ఇదేనా? మరేదైనా ఉందా? అన్న అనుమానం కూడా కొందరు వ్యక్తం చేస్తున్నారు. మొత్తం మీద.. ఫాం హౌస్ లో జరిగిన రేవ్ పార్టీకి, పొంగులేటి కామెంట్స్ కు ముడిపెడుతూ పోస్టులు పెడుతున్నారు.

## హైదరాబాద్ లో డబుల్ బెడ్‌రూంలకు నో.. త్రిబుల్ బెడ్ రూమ్‌లకు ఓకే

**హైదరాబాద్ పెన్ పవర్:**హైదారాబాద్ లో డబుల్ బెడ్ రూం ఇళ్లకు గిరాకీ తగ్గింది. ఎక్కువ కుటుంబాలు ట్రిపుల్ బెడ్ రూంలనే కొనుగోలు చేస్తున్నాయని గణాంకాలు చెబుతున్నాయి. ఒక కుటుంబంలో భార్యాభర్తలు, ఇద్దరు పిల్లలు ఉండటంతో భవిష్యత్ లో ముగ్గురి కోసం ట్రిపుల్ బెడ్ రూంలనే కొనుగోలు చేస్తున్నారు. కాస్త ధర ఎక్కువైనా డబుల్ బెడ్ రూం కొనుక్కొని ఇరుకు ఇళ్లలో ఉండలేక అనేక మంది ట్రిపుల్ బెడ్ రూం వైపు మొగ్గు చూపుతున్నారు. అసలు డబుల్ బెడ్ రూం ఇళ్లవైపు కూడా ఎవరూ మొగ్గు చూపకపోతుండకపోవడం, డిమాండ్ తగ్గిపోవడంతో బిల్డర్లు కూడా తమ వెంచర్లలో వీటికి ఎక్కువ చోటు కల్పించడం లేదు.

### ఖాళీగా డబుల్ బెడ్ రూం...

ఏదైనా పెద్ద ప్రాజెక్టులో అయితే తప్ప డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణం హైదరాబాద్‌లో జరగడం లేదు. కొత్తగా చేపట్టబోయే ఏ ప్రాజెక్టులోనైనా ముందు ట్రిపుల్ బెడ్ రూం ఇళ్లనే ఎక్కువగా కొనుగోలు చేస్తుండటంతో వాటి నిర్మాణాలనే త్వరితగతంగా పూర్తి చేస్తున్నారు. డబుల్ బెడ్ రూంలను పక్కన పెడుతున్నారు. ఎవరైనా వచ్చి ముందుగా అడ్వాన్స్ ఇచ్చి బుక్ చేసుకున్న తర్వాతనే వాటిని పూర్తి చేస్తున్నారు. అంతే తప్ప ముందు పెట్టుబడి పెట్టి డబుల్ బెడ్ రూం ఇళ్లను రెడీ చేసినా వాటిని కొనుగోలు చేసే వారు లేక అవి చాలా మిగిలిపోయాయి ఉన్నాయ. హైదరాబాద్ లోని అనేక వెంచర్లలో డబుల్ బెడ్ రూం ఇళ్లు బోల్డెన్ని ఖాళీగా ఉన్నాయి.

### మూడు బెడ్ రూంలు ఉంటే...

ప్రజలు కొనుగోలు శక్తి పెరగడంతో పాటు సాఫ్ట్ వేర్ ఇంజినీర్లు, ఎన్ఆర్ఐలు, రిటైర్ అయిన ఉద్యోగులు ఎక్కువగా ట్రిపుల్ బెడ్ రూం ఇళ్లవైపు ఆసక్తి కనపరుస్తున్నారు. దీని వల్ల స్పేస్ మాత్రమే కాకుండా భవిష్యత్ అవసరాలకు ఉపయోగకరంగా ఉంటుందని, కుటుంబం మొత్తం గడపటానికి కంఫర్ట్‌గా ఉంటుందని భావించి ట్రిపుల్ బెడ్ రూంలను ఎంచుకుంటున్నారు. ఎక్కువ చదరపు గజాలు లేకపోయినా మూడు బెడ్ రూంలు ఉంటే చాలు అవి వెంటనే అమ్ముడు పోతున్నాయని రియల్టర్లు చెబుతున్నారు. అదే సమయంలో తమ వారసులు కూడా ఇక్కడే స్థిరపడాలని కోరుకునే వారంతా ప్రస్తుతం ఉంటున్న డబుల్ బెడ్ రూం ఇళ్లను విక్రయించి ట్రిపుల్ బెడ్ రూం ఇళ్లకు వెళ్లిపోతున్నారు.

### సింగిల్ బెడ్ రూం తరహాలోనే..

కొన్నేళ్లుగా హైదరాబాద్ లో డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణం తక్కువగానే జరుగుతుంది. చిన్న చిన్న అపార్ట్‌మెంట్లలో తప్ప పెద్ద వెంచర్లు ఏవీ డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణం చేపట్టడం లేదు. గిరాకీ తగ్గిపోవడంతో పాటు భవన నిర్మాణానికి అనవసర వ్యయం ముందుగా ఖర్చు పెట్టి అప్పులకు వడ్డీ చెల్లించి రావాల్సి వస్తుండటంతో బిల్డర్లు వీటి నిర్మాణానికి వెనక్కు తగ్గారు. దీంతో ఇప్పుడు అనేక ప్రాంతాల్లో కట్టిన ఇళ్లే ఇంకా కొనుగోలుకు నోచుకోలేదు. అనేక సార్లు రియల్ ఎస్టేట్ కు సంబంధించి ఎక్స్ పోలో కూడా ఎవరూ డబుల్ బెడ్ రూం ఇళ్లపై ఆరా తీయకపోవడం కూడా ఇందుకు అడ్డం పడుతుంది. మొత్తం మీద హైదరాబాద్ లో ట్రిపుల్ బెడ్ రూం ఇళ్ల కల్చర్ ప్రారంభమయింది.